విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, మంగళవారం 20, మే 2025

ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం: కళ్యాణ్‌దుర్గం ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలని న్యాయ బ్రాహ్మణుల కుర్చీ దారుల సమాఖ్య నగర అధ్యక్షులు గోవిందరాజులు డిమాండ్ చేశారు. సిపిఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం విలేకరులతో నాయి బ్రాహ్మణ వృత్తి దారుల నగర అధ్యక్షులు గోవిందరాజులు, చేతివృత్తిదారుల రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్యలు చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ మాట్లాడుతూ... కళ్యాణ్ దుర్గం ఎక్సైజ్ సీఐ.. అటెండర్ ఏదైనా తప్పు చేస్తే అతనిపై విచారణ చేపట్టాలని గాని చెప్పుతో కొట్టడం ఏమాత్రం సరికాదన్నారు. సీఐ చెప్పుతో కొడుతున్న వీడియోలు వైరల్ అవుతున్నప్పటికీ ఉన్నతాధి కారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా సిఐను బదిలీ చేయడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు సి.నాగప్ప, గీత పని వాళ్ళ సంఘం జిల్లా కార్యదర్శి రఘు, చేతివృత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు భూషణ్ పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలుద్దాం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : దేశం కోసం పోరాడుతున్న సైనికులకు అండగా నిలుద్దామని బొమ్మనహాళ్ తాసిల్దార్ మునివేలు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం తిరంగా యాత్ర ఉత్సాహంగా సాగింది. తెలుగుదేశం, బిజెపీ, జనసేనా పార్టీల నాయకులు యాత్రలో పాల్గొని మన సైనికుల ధైర్యసాహసాలను కొనియాడారు. తహసీల్దార్ కార్యలయం నుండి కురువల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రవాదులను అణచడానికి, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని తహసీల్దార్ మునివేలు తెలిపారు. దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు పోరాడుతున్న మన సైనికులకు మనమందరం సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హిరోజిరావు, టీడీపీ నాయకులు మల్లీడు శ్రీనివాసులు, పయ్యావుల్ల నాగరాజు, జనసేన నాయకులు సికిందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విశాలాంధ్ర-తాడిపత్రి : బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ బిజెపి పార్టీలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లన్న గారి రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లన్న గారి రామాంజనేయులు ఆధ్వర్యంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంనేయులు మాట్లాడుతూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ బిజెపి కార్యకర్తలకు అండగా నిలుస్తూ బీసీ సమాజం కొరకు అనేక బలమైన కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. పార్టీలో ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు జిల్లా ప్రధాన కార్యదర్శి శివ సంజీవ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్ యాదవ్ జిల్లా వివర్స్ సెల్ కన్వీనర్ నారాయణ స్వామి బిజెపి పట్టణ అధ్యక్షులు కృష్ణ మోహన్ బిజెపి రూరల్ అధ్యక్షులు శేష నంద రెడ్డి జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ రంగనాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని పురాతన శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానానికి దాతలు తనికెంటి కృష్ణవేణి శేషాగలపతి రూ. 25 వేలు విరాళం సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ కి అందజేశారు. సుమారు 100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం అభివృద్ధికై గత రెండు సంవత్సరాల క్రితం దాతలు చిట్స్ వేసి, దాతల సహకారంతో ఆలయంలో టైల్స్ గుడి గోపురం కాంపౌండ్ వాల్ నిర్మించారు. ఇంకా అభివృద్ధి చేసే పనులు కొన్ని మిగిలి ఉన్నాయని దాతలు ఎవరైనా ముందుకు వస్తే పనులు చేపడతామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

మినీ మహానాడును జయప్రదం చేయండి : ఎమ్మెల్యే శ్రావణి

విశాలాంధ్ర-శింగనమల : గార్లదిన్నె మండల కేంద్రంలో శింగనమల నియోజకవర్గ మినీ మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నియోజక వర్గ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ,అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

కంబదూరు వైస్ ఎంపీపీగా సోమశేఖర్

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కంబదూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా ఎనుముల సోమశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వైస్ ఎంపీపీ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 1వ సెగ్మెంట్ ఎంపీటీసీ సోమశేఖర్‌ను ఎంపీటీసీలు చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి ధృవీకరణ పత్రాలు అందజేశారు. వైసీపీ సంపూర్ణ బలం ఉండడంతో.. కంబదూరు మండలం వైస్ ఎంపీపీ స్థానాన్ని వైకాపా కైవసం చేసుకుంది. కంబదూరులో పర్యటించిన సమన్వయకర్త ,పిఏసీ సభ్యులు తలారి రంగయ్య నూతనంగా ఎన్నికైన వైస్ ఎంపీపీ సోమశేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వాళ్ళకి ఎప్పుడు సముచిత స్థానం కల్పిస్తామని తెలియజేశారు.

జిల్లా సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలి

పేదల పక్షాన ఉద్యమించే పార్టీ సిపిఐ
సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలో జులై 25, 26, 27 తేదీల్లో సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని, పేదల పక్షాన ఉద్యమించే పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ పేర్కొన్నారు. సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1925 డిసెంబర్ 26న సీపీఐ ఏర్పడిందన్నారు. అనేకమంది త్యాగాలతో పునీతమైన ఎర్రజెండా పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ 1936 అనంత జిల్లాలో ఐదు కల్లు సదాశివన్, నీలం రాజశేఖర్ రెడ్డి, వి.కె. ఆదినారాయణ రెడ్డి స్వాతంత్ర సమరయోధులు సీపీఐని స్థాపించడం జరిగిందన్నారు. అప్పటినుంచి వేల ఎకరాల బంజరు, మిగులు భూములు, భూస్వాముల కబ్జాలో ఉన్న భూములను పంచిపెట్టడం జరిగిందన్నారు. ఆదివారం జరిగిన చెన్నప్ప యాదవ్ అధ్యక్షతన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా సమస్యల పట్ల కార్యాచరణ రూపొందించామన్నారు. కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతోందన్నారు. జూలైలో నిర్వహిస్తున్న మహాసభల్లో హంద్రీనీవా నీటి జలాల సమస్యలపై చర్చిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంటి స్థలాలపై ఇచ్చిన హామీలలో గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ నగరాలలో 2 సెంట్లు, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయంపై పేద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి కలెక్టర్, ఎమ్మార్వో కార్యాలయానికి అందజేశామన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తి చేశారని, పది శాతం ఖర్చుపెట్టి వాటిని పూర్తి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. ఈ అంశంపై జూన్ 2న ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ధర్నా చేపడతామన్నారు. ఆర్‌డిటికి విదేశీ నిధులను పునరుద్ధించే దిశగా సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. జూలై 25,26,27 నిర్వహిస్తున్న సిపిఐ మహాసభలలో అనంత జిల్లా సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఉన్న మేధావులు, అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తులు సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి, బి కేశవరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్ గౌడ్, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు వై. ఎల్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-అనంతపురం: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ వినోద్ కుమార్.వి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌లు రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయ శాఖ జేడి ఉమా మహేశ్వరమ్మ, పాల్గొన్నారు. ప్రజల నుంచి 460 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి వాటిలో పేర్కొన్న సమస్యలపై ఆచారణాత్మకమైన పరిష్కారం కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కార్యాలయంలోని పనికిరాని ఈ వేస్టేజ్ ఇతర సామాగ్రిని సైతం వేలం వేయాలన్నారు. అనంతరం రికార్డుల్లో వివరాలను పొందుపరిచే ప్రక్రియను జూన్ 20లోపు పూర్తి చేయాలన్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయాలి..

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర-అనంతపురం: అనంత కరువు జిల్లాకు ఖరీఫ్ సీజన్లో 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు గత పంట నష్టపోవడం వల్ల ఈ సంవత్సరం పెట్టుబడి డబ్బులు లేక ఇబ్బంది గురవుతున్నారు అన్నారు. బ్యాంకులు దగ్గర రెన్యువల్‌కు పోతే అసలు, వడ్డీ కడితేనే రెన్యువల్ చేస్తామని చెబుతున్నారని, దీంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని బ్యాంకులకు సంబంధించి అసలు కట్టించుకొని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ వారం రోజుల్లో ప్రారంభమవుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తుగా విత్తన సేకరణ సంబంధించి నిర్ణయం తీసుకోకపోవడం చాలా అన్యాయం అన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అని 20 వేలు మూడు దఫాలుగా ఇవ్వడం కంటే ఖరీఫ్ సీజన్‌కు ముందు ఒకే దఫాలో రైతులకు అందజేయాలని కోరారు.

విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయండి

విశాలాంధ్ర-శింగనమల: మండల వ్యాప్తంగా ముందస్తు వర్షాలతో రైతులు భూములను దుక్కులు చేసుకొని విత్తనానికి సిద్ధమవుతున్నారు... అయితే ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే వేరుశనగ కాయలు ఇంతవరకు వ్యవసాయ శాఖ గోడౌన్లలో సిద్ధం చేయలేదని సిపిఐ మండల కార్యదర్శి ఎం.మధు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సిపిఐ మండలకార్యదర్శి మధుయాదవ్, మండలసహాయకార్యదర్శి చేనేతమధు ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధయాదవ్ మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురుస్తున్నందున మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో అన్ని రకాల విత్తనాలు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు మూడు బస్తాలు వేరుశనగ కాయలు అందించాలని. గతంలో వేరుశనగ పంట సాగు చేసి సకాలంలో వర్షాలు కురవక రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులు..

విశాలాంధ్ర-కూడేరు: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా కూడేరులోని సిపిఎం ఆఫీసులో పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో 1917లో జన్మించి 1985లో మరణించారని సుందరయ్య విద్యార్థి దశ నుంచి విద్యార్థుల సమస్యల పట్ల అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో ఆందోళన పోరాటాలు చేశారన్నారు. తన సొంత గ్రామంలో తన ఇంటి నుండే కూలి పోరాటాలు నిర్వహించి తనకు వచ్చిన భూములను పేదలకు పంపిణీ చేశారన్నారు. దున్నేవానికి భూమి ఇవ్వాలని భూ పోరాటాలు నిర్వహించి అంటరానితనం కులవ్యక్షకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నిర్వహించి సమాజ మార్పు కోసం పేద ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించి పార్టీ షాకోప శాఖలుగా పెంచి సిపిఎం విస్తరించడానికి బలపడడానికి తన వంతు కృషి చేశారన్నారు పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత సైకిల్ మీద పోయి పేదల పక్షాన గళం వినిపించి ప్రభుత్వ విధానాలు అమలు చేయాలని పోరాడే వారన్నారు . ఆ మహానుభావుని ఆశయాలు లక్ష్యాలు తీసుకొని మండలంలో పార్టీని ప్రజాసంఘాలు విస్తరించడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ కరీం మండల కమిటీ సభ్యులు రాధాకృష్ణ. అరుణమ్మ .రామక్క మహిళలు కాంతమ్మ శ్రీలక్ష్మి ఇంద్రాణి, కమల, రమాదేవి పార్వతి పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థుల భోజన ఫీజు స్వాహాకారులపై చర్య తీసుకోండి

ఏఐఎస్ఎఫ్ ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల భోజనం కోసం చెల్లించిన దాదాపు రూ.20 లక్షలను ప్రభుత్వ మెడికల్ కళాశాల సిబ్బంది స్వాహా చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ముందు ధర్నా చేపట్టారు. నిధులు దారిమళ్లించన వారిపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వ ఖాతాకు కాకుండా ప్రైవేటు అకౌంట్లలోకి జమ చేసుకొన్న వారి పై ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి డిమాండు చేశారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరిగిన ఇంతవరకు ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయక పోవడం సిగ్గుచేటన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న తరుణంలో వాళ్లకు నచ్చిన ఆహారాన్ని తినడానికి ప్రతినెల ఒక్కొక్క విద్యార్థి రూ.4 వేల నుంచి 6వేల వరకు చెల్లించడం జరుగుతుందని, ఆడబ్బులను కళాశాల ప్రిన్సిపల్ ప్రైవేటు అకౌంటెంట్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం ఏమిటని కుల్లాయిస్వామి నిలదీశారు. ప్రభుత్వ అకౌంట్ కాకుండా ప్రైవేటు అకౌంట్ ద్వారా అక్రమాలకు పాల్పడే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. నాణ్యత గల ఆహారం అందకపోవడంతో విద్యార్థులు మేనేజ్మెంట్‌ను నిలదీశారని అయినా ప్రిన్సిపాల్ పట్టించు కోకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. విద్యార్థులు జమ చేసిన ప్రవేటు అకౌంట్ నెంబరును బహిర్గతం చేయాలని డిమాండు చేశారు. గతంలో కూడా ఇదే కళాశాలలో విద్యార్థికి సంబంధించిన ల్యాబ్ టాప్, మొబైల్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. మెడికల్ స్టూడెంట్‌ల నుంచి ఫిర్యాదులు వస్తే పై అధికారులు విచారణకై ఆదేశిస్తే తమకు అనుకూలమైన కళాశాల సిబ్బందిని ఎంక్వయిరీ కమిటీలో వేసి ఫిర్యాదు దారులను భయభ్రాంతులకు గురి చేస్తూ నిజనిజాలు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారన్నారు. న్యాయబద్ధంగా విచారణ చేసి అవినీతి పరులను శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు వెంకట్ నాయక్, చందు, నగర అధ్యక్షులు మంజునాథ్ నగర కోశాధికారి నాని నగర సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు పవన్, బాబ్జాన్, ప్రవీణ్, కార్తీక్, తౌసిఫ్, ఉమేష్, సుభాష్, సుభాహన్, యశ్వంత్, సోమేశ్ యోగేంద్ర పాల్గొన్నారు.

జూన్ 2వ తేదీన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల వాగ్దానం మేరకు పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రాప్తాడులో సిపిఐ మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు ముఖ్యఅతిథిగా రామకృష్ణ హాజరై మాట్లాడుతూ ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల చొప్పున ఇవ్వాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు.జూన్ 2న రాప్తాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హంద్రీనీవా కాల్వకు సంబంధించి కాలువ వెడల్పు చేయాలని రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు ఆయకట్టు నీరు ఇవ్వడం వల్ల దాని ద్వారా పిల్ల కాలువలు తీయించాలన్నారు. హంద్రీనీవా ద్వారా ఆయకట్టు నీరు ఇచ్చేంతవరకు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాప్తాడు మండల కేంద్రంలో గ్రామ శాఖ, మండల మహాసభలు నిర్వహించి స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎం.చలపతి, శాఖ కార్యదర్శులు మహమ్మద్ రఫీ, సంజీవులు, పెద్దిరాజు, పెద్దన్న, ఆదినారాయణ, నారాయణ స్వామి, నాయ కులు చౌడప్ప, టోపీ సాబ్, ఎల్.నారాయణ స్వామి, మల్లన్న, డి.ఖాసింసాబ్, సోమనాథ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి పురస్కారం అందుకున్న అనంతరాముడు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: వ్యవసాయ నిపుణుల విభాగంలో స్ఫూర్తి పురస్కారాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి రమణ ,శ్రీ త్రిదండి చిన్న జియర్ స్వామి, ఏపీ అసెంబ్లీ డిప్యుటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు చేతులమీదు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ముళ్ళగూరు అనంతరాముడు కు అవార్డును ప్రధానం చేశారు. డిజిటల్ మీడియా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న సంస్థ "తెలుగువన్" 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సామాజిక స్పృహ కలిగి అనుక్షణం ప్రజా సంక్షేమానికై పరితపిస్తూ వారు ఎంచుకున్న రంగాలలో విశేషమైన సేవలు అందించిన వారికి హైదరాబాదు లో జరిగిన కార్యక్రమంలో తెలుగువన్ స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. వ్యవసాయ రంగంలో తనదైన ముద్రను చాటుకుని అన్నదాతల అభివృద్ధికి, డ్రిప్ ఇరిగేషన్, పండ్లు తోటల పెంపకం, మార్కెటింగ్, సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడం, అవగాహన కల్పించడంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రైతుల హృదయాలలో నిలిచారు. ఈ అవార్డు రావడం పట్ల డైరెక్టర్ ఎం.రమేష్ నాయుడు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

హంద్రీ..నీవాపై కాలువ శ్రీనివాసులు బహిరంగ చర్చకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: హంద్రీ-నీవా కెనాల్ పనులు పూర్తి చేసిందెవరు? అందుకు ఎవరెంత నిధులిచ్చారో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రకటించారని దీనికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు సిద్ధం కాకుండా ఛాలెంజ్ విసిరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డిపై కాలువ శ్రీనివాసులు వ్యక్తిగత విమర్శలు చేశారని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో ఆ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణ యాదవ్, మాజీ ఎంపీపీలు తిప్పయ్య, రామచంద్ర విజయ్ కుమార్, మంగమ్మ, రాంబాబు మాట్లాడుతూ హంద్రీ-నీవాకు శిలాఫలకం వేసిన ఉరవకొండ లోనే బహిరంగంగా చర్చిద్దామని, తేదీ, సమయమెప్పుడో నిర్ణయించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ప్రతి సవాల్ విసిరారు. చర్చకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరవుతా రని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి, సారథ్యంలో మొదలైన రాయలసీమ ఉద్యమంపై అప్పటి సీఎం ఎన్టీ.రామా రావు స్పందించి హంద్రీనీవాకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లు సీఎంగా కొనసాగిన చంద్రబాబు హంద్రీ-నీవాకు రెండుసార్లు శంకుస్థాపన చేయడం తప్ప సాధించిన ప్రగతి అంటూ ఏదీ లేదన్నారు. 2004లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యాకనే హంద్రీ-నీవా పనులు వేగవంతమయ్యాయన్నారు. అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి హంద్రీనీవాలో 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని, కూటమి ప్రభుత్వం కేవలం 3,850 క్యూసెక్కులకే పరిమితం చేయడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి, మంత్రి కేశవ్‌కు విప్ కాలవకు చిత్తశుద్ధి ఉంటే 10 వేల క్యూసెక్కులకు హంద్రీ-నీవా సామర్థ్యం పెంచేలా పనులు చేపట్టాలని సవాల్ విసిరారు. చంద్రబాబు మెప్పుకోసం అసత్య ప్రచారాలు చేయొద్దన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తిచేసి ప్రతి ఎకరాకి నీరు అందించాలన్నారు. కాలువ శ్రీనివాసులు వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తిప్పారెడ్డి, అన్నలయ రఘు, మాలింగా, ముస్తూరు ఎర్రి స్వామి, ఆకుకూర నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హెూంగార్డుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : పదవీ విరమణ పొందిన కూడేరు పి.ఎస్ మహిళా హెూంగార్డును ఎస్పీ ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మహిళా హెూంగార్డు పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలంగా ఉత్తమ సేవలందించారని ఎస్పీ పి.జగదీష్ గుర్తు చేశారు. పదవీ విరమణ అనంతర జీవితాన్ని హెూంగార్డు కృష్ణవేణి ఆరోగ్యంగా సంతోషంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్ ఏఆర్ఎస్ఐలు, సాటి హెూంగార్డులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజాఅవరోహణం

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహెూబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరశింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం ఉదయం చక్రస్నానం తదుపరి వసంతోత్సవం, రాత్రి ధ్వజాఅవరోహణం, శ్రీవారి శయణోత్సవం తదితర వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ధ్వజాఅవరోహణం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభంలో ధ్వజారోహణం చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేసిన అర్చకులు.. ధ్వజాఅవరోహణం (గరుత్మంతుడి పటం) కిందకు దించడం ద్వారా ఉత్సవాలు ముగింపు పలికారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వారికి శయణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు 13 రోజులు వివిధ ఉత్సవాల్లో పాల్గొని అలసిన శ్రీవారు, ఉభయ దేవేరులకు శయణోత్సవం నిర్వహిస్తారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే రమేష్ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కంబదూరులో సోమవారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. కంబదూరుకు బెస్త శ్యాము బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న శ్యాముకు కరెంటు తీగ తగలడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంబదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తూనికలు, కొలతలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుత్తి: ఆర్టీసీ బస్టాండ్ లోని విచారణ విభాగం వద్ద సోమవారం లీగల్ మెట్రాలజీ అనంతపురం జిల్లా డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.జి.శంకర్ అధ్యక్షతన తూనికలు, కొలతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్,గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, సీనియర్ సిటిజెన్, కంటి ఆసుపత్రి ఓబులేసు, ఆటో యూనియన్ నాగార్జున హాజరయ్యారు. అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏ వస్తువును కొన్నా అందులోని విషయాలు గ్రహించాలని బరువు నాణ్యత ధర అన్ని ఖచ్చితంగా ఇస్తున్నారా అన్న విషయాలు గ్రహించి ఎక్కువ ధరకు విక్రయించిన, బరువు తక్కువ ఉన్న వెంటనే తూనికలు, కొలతలు శాఖ కు తెలియజేయాలని సూచించారు.డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ నాణ్యత కలిగిన వస్తువులను, కచ్చిత మైన బరువు వుండే వాటినే కొనాలని తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ఆర్ టి సి బస్టాండే కాదు,పెట్రోల్ పంప్ స్టేషన్లు రైల్వే స్టేషన్ లో నాణ్యమైన వస్తువులు నిర్ణత ధరకే కొనాలని ఎంఆర్పి కంటే ఎక్కువ ధరలు అమ్మే వారిపై అధికారులకు ఫిర్యాదు చెయ్యాలని ప్రయాణికులను కోరారు.ఈ కార్యక్రమం లో సామజిక కార్యకర్తలు సాదిక్ భాష, ఆటో నజీర్, ప్రయాణికులు,ప్రజలు పాల్గొన్నారు.

సజావుగా మొదటి రోజు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర-గుత్తి: పట్టణంలో సోమవారం నుంచి పదవతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయని మండల విద్యాధికారి రవి నాయక్ తెలిపారు. మొత్తం మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కోట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ముందుగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది పరీక్షా సిబ్బంది విద్యార్థులను చెక్ చేసిన అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ప్రతిరోజు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు టీడీపీ మినీ మహానాడు

విశాలాంధ్ర- కళ్యాణదుర్గం : తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు మంగళవారం సాయంత్రం కళ్యాణదుర్గంలోని కుందుర్పి రోడ్డు ప్రజా వేదిక వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహిస్తున్నామని 5 మండలాల పరిధిలోని అన్ని గ్రామ శాఖల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com కర్నూలు, మంగళవారం 20, మే 2025

కదిరి మున్సిపాలిటీ టీడీపీ కైవసం

- మున్సిపల్ చైర్ పర్సన్‌గా దిల్షాద్ దున్నిషా
- వైస్ చైర్మన్‌లుగా సుధారాణి, రాజశేఖరాచారి
- ఎన్నికను బహిష్కరించిన వైసిపి కౌన్సిలర్లు

శ్రీమతి దిల్షాదున్నిసా
చైర్ పర్సన్

శ్రీమతి సేగు సుధారాణీ
వైస్ చైర్మన్

మద్దేపల్లి రాజశేఖర ఆచారి
వైస్ చైర్మన్

విశాలాంధ్ర-కదిరి: మున్సిపల్ చైర్పర్సన్ పదవిని టిడిపి కైవసం చేసుకుంది. చైర్ పర్సన్ గా (10వ వార్డు) కౌన్సిలర్ కేఎస్ దిల్షాదున్నీషా, వైస్ చైర్ పర్సన్‌లుగా సుధారాణి, రాజశేఖర్ ఆచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2014లో టిడిపి తరఫున సురియా భాను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన విషయం తెలిసిందే.గత రెండు, మూడు నెలలుగా మున్సిపల్ చైర్ పర్సన్ పదవిపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా కౌన్సిల్లో మెజార్టీగా ఉన్న వైకాపా కౌన్సిలర్లు 2024 సాధారణ ఎన్నికల ముందు అనంతరం తలెత్తిన వైకాపా నేతల విభేదాల కారణంగా పలువురు వైకాపా కౌన్సిలర్లు టిడిపిలో చేరి వైకాపా చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం కు మద్దతు తెలపడంతో పాటు పదవి నుంచి తొలగించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నూతన చైర్ పర్సన్ ఎన్నికకు కలెక్టర్ టీఎస్ చేతన్ 19వ తేదీ సమావేశం ఏర్పాటుచేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతో తీవ్ర ఉత్కంఠ కు తెరలేపిందని చెప్పవచ్చు.ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఉత్కంఠకు తెర దించుతూ (10వ వార్డ్) కౌన్సిలర్ కేఎస్ దిల్షా దున్నీషా, (21వవార్డు) కౌన్సిలర్ సుధారాణి,19వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్ ఆచారిలను వైస్ చైర్మన్ గా ఎంపిక చేసారు.వైకాపా పార్టీకి చెందిన 11మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ ఎన్నికను బహిష్కరిస్తూ సమావేశా నికి గైర్హాజర య్యారు. ఎన్నికల నిర్వహణలో ఆర్డిఓ వివి ఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విలువైన ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

జెసిబితో ప్రహరీ గోడ ధ్వంసం

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో గల ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ఏకంగా జెసిబి తో ప్రహరీ గోడను ధ్వంసం చేసిన సంఘటన చోటుచేసుకుంది, మండల విద్యా వనరుల భవనం (ఎం.ఆర్.సి), ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, అంగన్ వాడి కేంద్రం భవనాల సముదాయాలు ఉన్న ప్రహరీ గోడను స్వార్థపరులు ఆదివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉంటుందని భావించి పథకం ప్రకారం జెసిబితో ప్రహరీ గోడను దర్జాగా కూల్చివేశారు. తొలి రోజు కూల్చివేత గురించి అధికారులకు తెలిసినా.. చోద్యం చూశారు. కూల్చివేత సోమవారం వెలుగు చూడటం, తీవ్ర విమర్శలు రావడంతో ఎంఈఓ జాన్ రెడ్డప్ప పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యా సాగర్‌లు తహసిల్దార్ మారుతికి ఎంపీడీవో నరేంద్ర కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు, 2.5 ఎకరాల స్థలంలో 1972లో తొలుత ప్రాథమిక పాఠశాల ప్రారంభమైంది, అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయం, గిడ్డంగి నిర్మిం చారు. మళ్లీ. మండల విద్యా వనరుల భవనం, అంగన్‌వాడి కేంద్రం, వైకాపా హయాంలో వ్యవసాయ గిడ్డంగిలో సచివాలయం ప్రారంభించారు. ఇదే ప్రాంగణంలో పట్టణానికి తాగునీటి సరఫరాకై జి.ఎస్.ఎల్.ఆర్ ట్యాంకులు నిర్మించారు. వీటికి ఇతర ప్రాంతాల్లో ఉన్న బోరుబావుల నుంచి పైప్లైన్ అను పంధానం, ట్యాంకుల నుంచి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా పైప్‌లైన్ నిర్మించారు. ఈ ప్రాంతం ఆక్రమణలకు గురి అవుతుండటంతో విడతల వారిగా.. ప్రహరీ నిర్మించారు. ఈ సముదాయం తూర్పువైపు 2002లో ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించారు, గ్రామ సచివాలయం ఎదురుగా ప్రహరీ గోడకు ఆవలి వైపు ఓబుళదేవర చెరువు మండలానికి చెందిన శివప్పకు చెందిన ఇంటి స్థలం ఉంది. కొంత మేర ఇంటి స్థలంలోనే ప్రహరీ నిర్మించారని ఇన్నేళ్లకు మేల్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో గ్రీవెన్స్ లో స్థల యజమాని కుమారుడు బాలు వినతి పత్రం అందజేశారు. మళ్లీ గత వారం గ్రీవెన్స్‌లో బాలు తమ స్థలంలోనే ప్రహరీ నిర్మించారని తమకు న్యాయం చేయండి అంటూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మారుతి, మండల అభివృద్ధి అధికారి నరేంద్ర కుమార్ కొలతల్లో ప్రహరీ మీ స్థలంలోనే నిర్మించారని తేలాల్సి ఉందన్నారు. కాగా ఆదివారం అదును చూసి స్థల యాజమాని కుమారుడు జెసిబితో ప్రహరీ గోడను కూల్చి వేయించారు. ఇది సోమవారం వెలుగు చూసి తీవ్ర విమర్శలు, చర్చకు దారితీసింది. తహశీల్దార్ గోడ కూల్చి వేయించిన బాలుని కార్యాలయానికి పిలిపించి తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. న్యాయం చేస్తామని ఒకవైపు చర్యలు తీసుకుంటే.. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ప్రభుత్వ స్థలం ప్రహరీ గోడను ఎలా కూల్చివేస్తావని, రెండు రోజుల్లోగా గోడను యదా స్థితిగా నిర్మించాలని ఆదేశించారు. లేని పక్షంలో పోలీసులకు ప్రభుత్వ స్థలం ధ్వంసంపై కేసు పెడతామని తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సిపిఎం నాయకులు భాషా, పెద్దన్న, మారుతి, రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ఆదర్శవంతమైన నాయకులలో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య అని, రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా వారిని అభిమానించేవారన్నారు. జాతీయ స్థాయిలో సైతం ఉన్నత విలువలు పాటించి నెహ్రూ లాంటి వారి అభిమానాన్ని సైతం చురుగున్న మహా వ్యక్తి అని కొనియాడారు. నిబద్ధత కలిగిన అసాధారణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ, పోరాట విలువల్లో నుంచి సుందరయ్య లాంటి మహనీయులు రాజకీయాల్లో అడుగుపెట్టడం జరిగిందని తెలిపారు. సమాజం కోసం త్యాగం చేయడం, ప్రజల పట్ల నమ్రత, నమ్మకం, పోరాటాల పట్ల నిబద్ధత, మార్క్సిస్ట్ సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసము గల ఆయన వ్యక్తిత్వం నేడు వారు మన ముందు లేక పోయినా వారు నిర్మించిన ఉద్యమం, ఆయన చూపిన బాట అంద రికీ ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో అయూబ్ ఖాన్, ఆది నారా యణ, వెంకటస్వామి, నారాయణస్వామి, నాగవేణి పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వనాథ స్వామి ఉయ్యాలోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని శ్రీ కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథ స్వామి దేవస్థానంలో ఉయ్యాలోత్సవం, పల్లకి సేవ భక్తాదులు, దాతల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించామని, ఆలయ ప్రధాన అర్చకులు కైప ద్వారకనాథ్ శర్మ పేర్కొన్నారు. పల్లకి సేవ ఉత్సవానికి ఉభయ సేవ కర్తలుగా శ్చెన్నమ రెడ్డి గారి గోపాల్‌రెడ్డి ఆయన సతీమణి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించామని, వారి పేరిట ప్రత్యేక అర్చనలు పూజలు నిర్వహిస్తూ వారిని ఘనంగా సత్కరించినట్లు చెప్పారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పురవీధులలో ఊరేగించిన వైనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

మృతుడి వివరాలు లభ్యం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కురవ కళ్యాణ మండపం వెనుక ఈనెల 18వ తేదీ రైలు కిందపడి మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయని ఆదివారం హిందూపురం జి ఆర్ పి హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. చనిపోయిన వ్యక్తి ధర్మవరం పట్టణంలోని సిద్దయ్య గుట్టకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, బి. శ్రీనివాసులు (63) బార్బర్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని తెలిపారు. గత 20 ఏళ్లుగా గుండెపోటు, మెదడుకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ ఉండేవాడని తెలిపారు. కుటుంబ సభ్యులు అనంతపురం, బెంగళూరు తదితర ఆసుపత్రులలో వైద్య చికిత్సలు అందిస్తూ ఉండేవారని తెలిపారు. ఆరోగ్యం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 18వ తేదీ ఉదయం 11:30 గంటల సమయంలో ఇంటి బయటకు వెళ్లి, రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతునికి భార్య అనంతమ్మ, కొడుకు వరుణ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

21న పెనుకొండలో మినీ మహానాడు

విశాలాంధ్ర-గోరంట్ల : ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ఆధ్వర్యంలో ఈ నెల 21న బుధవారం మినీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోరంట్ల మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు, టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డులో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రక్కన గల స్థలంలో మినీ మహానాడుకు మంత్రి ఎస్ సవిత ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ మినీ మహానాడు కార్యక్రమానికి మండలం లోని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, టీడీపీ శ్రేణులు తప్పని సరిగా భారీగా తరలి వచ్చి విజయ వంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి,మాజీ సర్పంచ్ నరేష్ కుమార్, నిమ్మల శ్రీధర్,బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, పార్లమెంట్ కార్యదర్శి షేక్ అజ్మతుల్లా, జిల్లా కార్య దర్శి బీరే వేణుగోపాల్ రాయల్, జయరామ్, నాగరాజు, మల్లా పల్లి మోహమ్మద్, రవి మోహన్,బూధిలి రవి, రామచంద్ర, సద్దామ్, లక్ష్మీ నరసు, రంగనాథం, అచ్యుత్ చౌదరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పెనుకొండ : టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జన్మదినం పురస్కరించుకొని పెనుకొండ నియోజకవర్గంలో 21న ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు ఈ సమావేశం నిర్వహించి వివిధ తీర్మానాలను రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళతామని నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పుట్టపర్తిలో 24న తేదీన జిల్లా మినీ మహానాడు సమావేశాలు ఉంటాయి. పెనుకొండ నియోజకవర్గంలో మినీ మహానాడు 21న 11.00 గంటలకు బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ అధ్యక్షతన ఉంటుందని కన్వీనర్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టిడిపి కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, సిద్ధ లింగప్ప, గోవిందరెడ్డి, నాయకులు నాగలూరు నారాయణస్వామి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి అంజనేయులు, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, పాలడుగు చంద్ర, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ లేఔట్ల పై చర్యలు తీసుకోవాలి : సిపిఐ..

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల కేంద్రంలో అక్రమంగా వెలుస్తున్న లేఔట్లపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపిడివో కార్యాలయంలో సిపిఐ,సిపిఎం నాయకులు కలిసి మండలంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎంపీడీవో పార్థసారథితో చర్చించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ప్లాట్లు వేసి అమ్ముకుంటూ పన్నులు కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. రియల్టర్ల మాయ మాటలు నమ్మి ఇప్పటికే చాలా మంది ప్రజలు మోసపోయారని తెలిపారు.వాగులు,వంకలు కబ్జా చేసి అందులో ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అలాగే మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారని మండల వామపక్ష నాయకులు ఎంపిడివో దృష్టికి తీసుకెళ్లారు. వాగులు, వంకలు కబ్జా చేసి అందులో ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి రమణ,జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ రెడ్డి,సిపిఎం నాయకులు నాగిరెడ్డి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నిక్షేపాలకై కేంద్ర బృందం పరిశీలన

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని మర్రికొమ్మదిన్నె సమీపంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయన్న సమాచారంతో కేంద్ర జిఎస్ఐ డైరెక్టర్ ఫ్రిడిక్ రోనాల్డ్,రాష్ట్ర జిఎస్ఐ డైరెక్టర్ వివేక్ శర్మ సోమవారం ఆ పరిసరాల భూమిని పరిశీలించారు. సర్వే పూర్తి అయ్యేవరకు 250 ఎకరాల భూమిని ఎవరికి అప్పగించరాదని ఆదేశించారని తహసీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జిలాని,విఆర్వో రఘు పాల్గొన్నారు.

యంత్రాలతో పనిచేస్తే క్రిమినల్ చర్యలు : ఎంపీడీఓ

విశాలాంధ్ర - అగళి : కూలీలకు కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం పనులను కూలీల ద్వారా కాకుండా యంత్రాలతో చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని ఎంపీడీఓ యాదవేంద్ర ఏపిఓ మంజునాథ్ తెలిపారు. మండలంలో పనులను పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాల్సిన బాధ్యత మెట్ లు ఫీల్డ్ అసిస్టెంట్ లపై ఉందన్నారు. నాణ్యతగా పారదర్శకంగా పనులు చేయకపోయినా యంత్రాలతో పని చేయించినా భూ యాజమాని, యంత్రాలపైన మెట్‌ల పైన ఫీల్డ్ అసిస్టెంట్ లపైన క్రిమినల్ చర్యలు వుంటాయన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఏదైతే లక్ష్యంగా పెట్టుకొందో ఆ లక్ష్యానికి తూట్లు పొడిస్తే సహించేదిలేదని పేర్కొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర-చిలమత్తూరు : అఖిలభారత నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సుందరయ్య కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని, సమానత్వ సమాజం కోసం ఆయన చేసిన పోరాటం శ్రేష్ఠమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య కాలని కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు నరసింహ కాలనీవాసులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ సివిల్ సప్లై గోడౌన్ నందు సిఐటియు ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, మాట్లాడుతూ సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ వారి తల్లిదండ్రులతో విభేదించి పేదలకు తమ సొంత భూమిని పంచిఇచ్చిన మహనీయుడని, దేశంలో కూలి సంఘాలు ఏర్పాటు చేసి కూలి రేట్లు పెంచాలని పోరాడిన వ్యక్తి సుందరయ్య ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఇప్పటితరంకి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సుధాకర్, హనుమంతు, శివ, ముత్యాలు, ఓబులేసు, హను మంతు, అక్కులప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

రేపు రొళ్లలో తిరంగా ర్యాలీ..

విశాలాంధ్ర-రొళ్ల : ఆపరేషన్ సిందూర్'విజయాన్ని పురస్కరించుకొని రొళ్ళ మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10:00 గంటలకు చేపట్టదలచిన భారత శౌర్య తిరంగా యాత్రలో ప్రతి భారత పౌరుడు దేశభక్తి పూర్వకంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయోత్సాహం వ్యక్తం చేయాలని బిజెపి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్.ముద్దరాజు, డాక్టర్.నాగేంద్ర పట్టాభిరామ్ తెలియజేశారు.మండలంలోని దేశభక్తులు, అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని రొళ్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సమీపంలోని శనిమహాత్మా దేవస్థానం కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మన దేశ శౌర్యపరాక్రమాలను ఘనంగా చాటిన సైనికులు, త్రివిధ దళాలకు సంఘీభావం ప్రకటించాలని కోరారు.

అసంబద్ధ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఆపండి..

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: ప్రభుత్వం చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ అసంబద్ధాలతో అశాస్త్రీయంగా ఉందని, తక్షణం ఆపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు పెను సవాలుగా మారిన 117 జీవోను రద్దు చేసి మెరుగైన విద్యా వ్యవస్థను తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పాఠశాలలను విభజించి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, వాటి పేరుతో ఒకటి రెండు తరగతులతో కూడిన ఫౌండేషన్ పాఠశాల లను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రాథమిక తరగతులు ఉన్నత పాఠశాలలకు తరలించే కేంద్రీకృత విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం సబ్జెక్ట్ టీచర్ల బోధన అని, ఈ ప్రభుత్వం మోడల్ ప్రైమరీ లంటూ పాఠశాల విద్యా రంగాన్ని ప్రయోగశాలగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. ఉ ఏకపక్ష నిర్ణయాలతో అడ్డగోలుగా పాఠశాల లను విభజించి పల్లె బడులను ప్రశ్నార్థకం చేస్తున్నా రన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు వేళల్లో ఉద్భవించి పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదముందని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, టీచర్ పీపుల్ రేషియో అన్ని రకాల ప్రాథమిక పాఠశాలలో ఒకేలా ఉండాలని, 45 పిల్లలు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలకు మూడవ పోస్టుల కేటాయించాలని తెలిపారు. ప్రతి మోడల్ ప్రైమరీ పాఠశాలకు పి ఎస్‌హెచ్‌ఎంతో పాటు ఐదు ఉపాధ్యాయులను నియమించాలని, 60 మంది పిల్లలు దాటి ప్రతి 30 మందికి ఒక ఉపాధ్యాయుని మోడల్ ప్రైమరీ పాఠశాలలకు నియమించాలని తెలిపారు. పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించడం ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతుల బోధనకు ప్రతి సబ్జెక్టుకు సబ్జెక్టు టీచర్‌ని కేటా యించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలలలో 45 మంది పిల్లలకు ఒక సెక్షన్ ప్రాతిపదికన సెక్షన్ల విభజన చేయాలన్నారు.

బొమ్మల తయారీపై శిక్షణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో ఉచిత శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బొమ్మల తయారీపై శిక్షణను ఇవ్వడం జరిగిందని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలియజేశారు. చదువుతోపాటు ఆటలు, డ్రాయింగ్, వివిధ కళలను నేర్వడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టీచర్ వెన్నెల ద్వారా బొమ్మల తయారీ, నీతి కథలు చెప్పడం, ఇంగ్లీష్ చదివించారు. ప్రతిరోజు తెలుగు రాయట, చదువుట అలవాటు చేసుకున్నప్పుడు సులభతరం అవుతుందని తెలిపారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు ఉంటుందన్నారు. గ్రంథాలయాలలో పోటీ పరీక్షల పుస్తకాలు ఉచితంగా లభిస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో 24 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణ నాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

గాండ్లపెంట ఎంపిపిగా సోము

విశాలాంధ్ర-కదిరి టౌన్ : గాండ్లపెంట మండల పరిషత్ అధ్యక్షుడిగా తాళ్లకాల్వ సోము శేఖర్ ఎన్నికయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ఎన్నికకు వేపరాల ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్న తాళ్లకాల్వ సోము శేఖర్‌ను ఎన్నుకున్నారు. 2024 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అధికార వైసీపీకి కాదని తెలుగుదేశం అధికారంలోకి వచ్చినది. అనంతరం జరిగిన పరిణామాలతో ఎంపిపిగా ఉన్న జగన్మోహన్ రాజీనామా చేయడంతో ఎంపిపి ఎన్నిక అనివార్యమైంది. నెల రోజుల క్రితం ఎంపిపి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన కోరం లేక వాయిదా పడింది. ఎట్టకేలకు సోముకు ఎంపిపి పదవి వరించింది.

అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన 206 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో కలెక్టరేట్ కు వస్తారన్నారు. ఇక్కడ వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అందుకు ఎన్ని మొక్కలు అవసరమో జాబితాని సిద్ధం చేసి ఆయా శాఖల హెచ్ ఓడి లకు అటవీ శాఖ అధికారికి పంపాలని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలో పలు పనులు పెండింగ్లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవోలకు, ఈవోఆర్డీలకు రేపటి రోజు కలెక్టరేట్లో పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్‌డిఏ పిడి నరసయ్య, డిఆర్ఓ విజయసారథి, ఆర్డీవో సువర్ణ, పాల్గొన్నారు.

మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందవేత

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎల్సికేపురం 26వ వార్డు తెలుగుదేశం కుటుంబ సభ్యులైన బోయ బలప్ప అనారోగ్య కారణంగా అకాల మరణం చెందాడు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు టైలర్ గోపాల మట్టి ఖర్చులకు గాను ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మీ కుటుంబానికి టిడిపి ఎల్లప్పుడు అండదండలుగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహులు, నాగంజి ,రషీద్ ఖాన్, షఫీ, వంశీ ,ఉపేంద్ర , బాలకృష్ణ, నాగేంద్ర, చికెన్ నాగేంద్ర ,వెంకటరాముడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని రంగా థియేటర్ ఆవరణములో ఈనెల 20వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెగా రక్తదాన శిబిరమును నిర్వహిస్తున్నట్లు తారక్ చేయుత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు అంకె రామాంజనేయులు ఉపాధ్యక్షులు వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ తుకారాం, ముత్యాలు, రమేష్, నవ కుమార్ తెలిపారు. జూ.ఎన్టీఆర్ నందమూరి తారకరామారావు జన్మదినం సందర్భంగా ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం మాకెంతో ఆనందదాయకంగా ఉందని తెలిపారు. రక్తదానం చేసిన వారికి ఒక లక్ష రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కలదు అని వారు తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో రక్తం ఇచ్చేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ముందుకొచ్చి శిబిరాన్ని విజయవంతం చేయాలని వారు తెలిపారు.

మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

చైర్ పర్సన్ దిల్షాదున్నిసా

విశాలాంధ్ర-కదిరి : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సారథ్యంలో తోటి కౌన్సిలర్ సమిష్టి కృషితో మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని చైర్ పర్సన్ దిల్షా దున్నిసా పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ దిల్షాదున్నిసా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అండదండలతో అనతి కాలంలోనే మున్సిపాలిటీలోని అన్ని వార్డులో అభివృద్ధి పనులు చేపట్టి ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన తోటి కౌన్సిలర్లకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ సుధారాణి,టిడిపి సీనియర్ నాయకులు కే ఎస్ బాహుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి

విశాలాంధ్ర-రొద్దం: రొద్దం మండలం పెద్ద గువ్వల పల్లి గ్రామంలో సోమవారం భగీరథ జయంతి పురస్కరించుకుని మొదటగా పెద్ద ఎత్తున పెద్ద ఎత్తున మహిళలు జ్యోతుల ఉత్సవం గ్రామంలో నిర్వహించారుభగీరథ చిత్రపటాన్ని గ్రామంలో తప్పెటలమోతలతో బాణాసంచా శబ్దాలతో ఉప్పరులు, సగరులు కేరింతలు ఈలలతో నృత్యాలు చేసుకుంటూ చేసుకుంటూ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు అనంతరం గ్రామంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు మండలంలోని సగరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

విశాలాంధ్ర-బత్తలపల్లి: మండల పరిధిలో వేల్పుమడుగు క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు ముదిగుబ్బ గ్రామానికి చెందిన మట్రా అంజనేయులు (59)తన భార్య అలివేలమ్మతో కలిసి ధర్మవరం మార్కెట్‌కు లగేజీ ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అంజనేయులు ఆటో నడుపుతుండగా, ఆయన భార్య డ్రైవర్ పక్కన కూర్చున్నారు. వెనుక వైపు నుండి వేగంగా వచ్చిన బండల ట్రాక్టర్ వారి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న అంజనేయులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య అలివేలమ్మకు కూడా గాయాలు తగిలాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి ఆమెను బత్తలపల్లిలోని ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు. అలివేలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అంజనేయులుకు ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు జరిగాయి. అంజనేయులు ఆయన భార్య అలివేలమ్మ ధర్మవరం మార్కెట్‌లో తెల్లగడ్డలు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించి జీవనం సాగించేవారు.

22న హనుమాన్ శోభాయాత్ర

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో ఈనెల 22వ తేదీన హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఉగా కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం వారు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ హనుమాన్ శోభాయాత్రను హిందూ ధర్మిక సంస్థలు, కుల సంఘ కమిటీలు, దేవాలయ కమిటీలు, భజన సంఘాలు, హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. జిల్లా ఉపాధ్య క్షులు వెంగముని, జిల్లా బజరంగ్దళ్ సంయోజక్ మురళీమోహన్ రెడ్డి, ప్రఖండ కార్యదర్శి రామానుజులు, ఆర్ఎస్ఎస్ కండ ఉపాధ్యాయ ప్రముఖ అన్నం అరవింద్, బండ్లపల్లి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ధర్మవరం ఎక్సైజ్ ప్రొఫెషన్ స్టేషన్‌ను అనంతపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీరామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవోదయం 2.0 విజయవంతం చేయడం కొరకు విలువైన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నాటుసారా పూర్తిగా తొలగించుటకు అధికారులు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. దీర్ఘకాలిక కేసులను త్వరితంగా పరిష్కరించాలని తెలిపారు. ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 20, మే 2025

ప్రజల గొంతుక పుచ్చపల్లి సుందరయ్య

విశాలాంధ్ర- గుంతకల్లు: గుంతకల్లు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ అధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల జండా ఆవిష్కరణలు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట యోధుడు అవిశ్రాంత పోరాట యోధుడు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడు దక్షిణ భారత కమ్యూనిస్టుపార్టీ ఉద్యమ నిర్మాత..ప్రజాసేవకోసం పిల్లల్ని సైతం వద్దనుకున్న మహా నేత..వారసత్వంగా వచ్చిన ఆస్తిని పార్టీకి ఇచ్చిన త్యాగ ధనుడు. ప్రజా గొంతుకగా నిలిచిన గొప్ప పార్లమెంటేరియన్ పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్‌పై ఫైళ్ళను కట్టుకుని వెళ్లిన గొప్ప నాయకుడునీ అన్నారు. తన పేరు కులాన్ని సూచిస్తోందని పుచ్చలపల్లి సుందరరామిరెడ్డిగా ఉన్న పేరును..కులం తోకను తీసేసి సుందరయ్యగా పేరు మార్చుకున్న ఆదర్శనీయడునీ కొనియాడారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామం సొంత ఊర్లోనే మొదటిసారిగా కుల వివక్షత పై పోరాటం చేసి దళితులను సొంత ఊరిలోని బావిలో నీరు తాగించడం మరియు రైతు కూలి సంఘం పెట్టిన నాయకుడు.. 1964లో కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నుండి విడిపోయి... భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) సిపిఐఎం పార్టీ ఏర్పడినప్పుడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమేమి చేస్తే బావుంటుందోనని వాటన్నిటిని గ్రంథస్తం చేసిన రచయిత.. నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన పోరాట యోధుడు...ఇలా ఎన్ని చెప్పినా...తరగని జీవిత చరిత్ర ఆయనిది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్ర, పట్టణ నాయకులు డి శ్రీనివాసులు, ఉల్లిగప్ప, తిమ్మప్ప, ఎస్‌కే యం భాష, చంద్రశేఖర్, ఓబులేసు, శాషా, అబ్దుల్లా, సూరి, రాము నాయక్, షబ్బీర్,జయమ్మ, ఖాదర్, ఈరన్న, సుగుణ, షకీరా,సరస్వతి,కిష్టప్ప,తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

విశాలాంధ్ర-పెనుకొండ: రెవెన్యూ డివిషనల్ అధికారి ఆనంద రావు నేతృతంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయము, నందు అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశము నందు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులు గురించి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో చర్చించడం జరిగినది అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్ లను నియమించుకో వలేనని తెలిపినారు. ఈ సమావేశమునకు నియోజక వర్గంలోని ఏఈఆర్‌ఓలు, సీనియర్ సహాయకులు, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు, రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

గుంతకల్ మండల విలేకరి మృతి

విశాలాంధ్ర-గుంతకల్లు: వజ్రకరూరు మండలం కొనకండ్ల గ్రామానికి చెందిన విలేకరి జి.గురు ప్రసాద్ కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. 20 సంవత్సరాలుగా విశాలాంధ్ర, ప్రజాశక్తి, అక్షర టైం, సూర్య, టైమ్స్, వివిధ పత్రికల్లో పనిచేసిన వంటి ఆయన అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం చికిత్స పొందుతూ మరణించడం చాలా బాధాకరం నీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వై భీమ్ రెడ్డి అన్నారు. ఆయన భౌతిక ఆయనకి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ఉంటుందని ఆయన అన్నారు. అలాగే విలేకరులు, రాజకీయ నేతలు గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున భౌతికయాన్ని చూడడానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో సివిఆర్ న్యూస్ అనంత ఉమ్మడి జిల్లాల బ్యూరో త్రిలోక్ నాథ్,ప్రజాశక్తి విలేకరి వెంకటేష్, ప్రజాశక్తి గుత్తి విలేఖరి రామకృష్ణ, గుంతకల్ విశాలాంధ్ర విలేకరి గుడిసె చిన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: ప్రజలు అనేక సమస్యలతో ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యలయలకు వస్తుంటారు. దీంతో వారి దాహం దప్పిక తీర్చేందుకు రెవిన్యూ కార్యాలయం వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు మల్లీడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మునివేలు, సింగల్ విండో మాజి అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున చేతులు మీదుగా పంపిణీ చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశామని మల్లీడు శ్రీనివాసులు తెలిపారు. టీడీపీ నాయకులు ఖాశీమ్, ప్రేమకుమార్ తదితరలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 15 మంది అర్జీల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 15 దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు కావాలని కోరుతూ ప్రజలు 15 మంది తమ అర్జీలు అందజేశారు. కాగా త్వరలో సమస్యలకు పరిష్కారం చూపుతామని తహసిల్దార్ తెలిపారు.

పిల్లలు పుట్టలేదని

వ్యక్తి ఊరి వేసుకొని ఆత్మహత్య

విశాలాంధ్ర - గోరంట్ల : పిల్లలు పుట్టలేదని మనస్థాపనతో వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోరంట్ల మండలంలో చోటుచేసుకుంది. సీఐ బోయ శేఖర్ తెలిపిన వివరాల మేరకు గోరంట్ల మండలంలోని బూచేపల్లి గ్రామానికి చెందిన లోచర్ల చరణ్ కుమార్ (33) కియా అనుబంధ సంస్థలు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు,మొదటి వివాహం చేసుకున్నాడు. అయితే సంతానం కలగకపోవడంతో ఇరువురి మధ్య మనస్పర్ధలు ఏర్పడి విడాకులు తీసుకున్నాడు. అయితే మళ్లీ మూడు సంవత్సరాల క్రితం పూజ అనే యువతితో వివాహం చేసుకొని ఆమెకు కూడా పిల్లల పుట్టకపోవడంతో కల్లితండాలో జరిగిన డ్రామాకు వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లి,జీవితంపై విరక్తి చెంది, గ్రామానికి సమీపం లోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు,అయితే మృతుడి తండ్రి లోచర్ల నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మినీ మహానాడును జయప్రదం చేయండి

ఎమ్మెల్యే బండారు శ్రావణి

విశాలాంధ్ర–శింగనమల : గార్లదిన్నె మండల కేంద్రంలో శింగనమల నియోజకవర్గ మినీ మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నియోజక వర్గ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ,అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ప్రాథమిక సభ్యత్వం

తొలగించడం సరియైన విధానం కాదు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఏపీటీఎఫ్ ప్రాథమిక సభ్యత్వం నుంచి తనను తొలగించినట్లు రాష్ట్ర నాయకత్వం ప్రకటించడం సరైన విధానం కాదని ఏపీటీఎఫ్ జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి బి. హనుమప్ప తెలిపారు. సోమవారం స్థానిక పెన్షనర్ భవనము నందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సంఘంలో ఖాళీ అయిన రాష్ట్ర కార్యదర్శి పదవికి 2024 అక్టోబర్ 14, 15 న లో రాష్ట్ర సంఘం నిర్వహించిన సబ్ కమిటీ కార్యవర్గ సమావేశంలో అనంతపురం జిల్లా నుంచి 9 మంది సబ్ కమిటీ మెంబర్లు మెజార్టీ అభిప్రాయము తనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక చేయాలని లేఖ ద్వారా తీర్మానించి రాష్ట్ర సంఘానికి అందజేయడం జరిగినదని అయితే రాష్ట్ర సంఘము ఏకపక్షంగా కేవలము ఇద్దరు వ్యక్తులు చెప్పి నా పాపి రెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక చేస్తూ పత్రికా ప్రకటన ఇవ్వడం జరిగినదని తెలిపారు. అయితే పాపిరెడ్డి ఎన్నిక అప్రజాస్వామికంగా జరిగిందని అతనిని రాష్ట్ర కార్యదర్శిగా ఎట్టి పరిస్థితుల్లో జిల్లా శాఖ ఆమోదించమని 2024 అక్టోబర్ 18 న పత్రికాముఖంగా తెలియజేశామని దీనిని జీర్ణించుకోలేని పాపిరెడ్డి నన్ను ఏపీటీఎఫ్ ప్రాథమిక సభ్యత్వం నుండి రెండు సంవత్సరాలు తొలగిస్తున్నట్లు పత్రికలకు ప్రకటనలు ఇవ్వడం జరిగిందని నా ప్రాథమిక సభ్యత్వం పట్ల రాష్ట్ర సంఘము తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ లాయర్ ద్వారా నోటీస్ ఇవ్వడం జరిగిందని నా అంశము లీగల్ ప్రొసీడింగ్ లో ఉందన్నారు. నా ప్రతిష్టను సమాజంలోనూ ఉపాధ్యాయ వర్గము లోనూ కించపరిచే విధంగా అవమానపరిచే విధంగా నన్ను సస్పెన్షన్ చేస్తున్నట్లు పాపి రెడ్డి పత్రిక ప్రకటనలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇతనిపై కూడా లీగల్ గా కోర్టులోనూ , పోలీస్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నా సభ్యత్వము రద్దు చేయడానికి ముఖ్య కారణం 2022లో జరిగినటువంటి గుంటూరు, కృష్ణ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసిన పాండురంగ వరప్రసాద్ కి ఎన్నికల నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల పండు వసూలు చేయడం జరిగినదని అనంతపురం జిల్లా శాఖ నుండి జిల్లా శాఖ ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర సంఘానికి గాని, ఎన్నికల కమిటీకు గాని అందిన విరాళాలు తెలియజేయండి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడగడం జరిగింది దీనిపై పాండురంగ వరప్రసాద్ స్పందిస్తూ నన్నే లెక్కలు అడుగుతావా అని ఆగ్రహము వ్యక్తం చేశారు. అని తెలిపారు. అనంతపురం జిల్లాలో ఉన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, లక్షలు రూపాయలు వసూలు చేసి రాష్ట్ర సంఘానికి ఎన్నికల కమిటీకి కేవలం రూ.25000 మాత్రమే ఇవ్వడం జరిగింది. అయితే నేను రాష్ట్ర కమిటీకి లెటర్ పెట్టడం ద్వారా అకౌంట్ మార్పు జరిగిందన్నారు. రేపు అక్టోబర్ లో లేదా సెప్టెంబర్ లో జరిగే జిల్లా ఎన్నికలలోను రాష్ట్ర సంఘం ఎన్నికలలోను అడ్డువస్తానని రాష్ట్ర సంఘముకు పోటీ పడతాడని కక్షగట్టి నా సభ్యత్వాన్ని రద్దు చేయడం జరిగింది ఇది అన్యాయమని నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎటువంటి ఆర్థిక అభియోగాలు లేని సంఘ వ్యతిరేక కార్యక్రమాలు లేని నన్ను తొలగించడం పై హైకోర్టులో రిట్టు వేస్తానని హనుమప్ప తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి ..

విశాలాంధ్ర- యాడికి: మండలం కొనుప్పులపాడు గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న పెద్ద కంబన్న సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సంజమ్మ సంతానం కూతుర్లు లక్ష్మీదేవి, వరలక్ష్మి, కుమారుడు కంబగిరి ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ ప్రతాపరెడ్డి మృతుడి భార్య సంజమ్మకి అంత్యక్రియల ఖర్చులకు రూ.15000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి పెద్ద కమ్మన్న మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిష్టప్ప, విఆర్ఓ అనిల్, వీఆర్ఏ సుంకన్న, ప్రేమి సిబ్బంది పాల్గొన్నారు.

వానకు తడుస్తున్న సమాచార పేపర్లు, కంప్యూటర్లు

విశాలాంధ్ర-కణేకల్లు: చినుకు పడితే చాలు భయం. అన్ని కంప్యూటర్స్ మీద ప్లాస్టిక్ కవర్ను పైన కప్పి పనులు చేస్తున్న సిబ్బంది. కనేకల్ గ్రామపంచాయతీ ఆఫీసులో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆఫీసులోని వారికి అందరికీ భయం ఎందుకంటే వర్షాకాలం పోయేంతవరకు గ్రామపంచాయతీ ఆఫీసులోని ఫైళ్లు ,కంప్యూటర్స్ అన్ని వర్షానికి తడిసి ముద్ద కావాల్సిందే. పైనుండి వర్షానికి కారుతున్న వర్షపు నీరు లోపల కంప్యూటర్స్ మీద ఫైల్స్ మీద వర్షపు పై నుంచి నీరు కారుతున్నది. దీని గురించి పై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కంప్యూటర్స్ గురించి కొన్ని వేల రూపాయలను పెట్టి కంప్యూటర్స్ సదుపాయాలు కల్పించిన పై అధికారులు బిల్డింగ్ మరమ్మత్తులు ఎందుకు చేయించలేకపోతున్నారు అర్థం కావడం లేదు, మండలానికి సంబంధించిన పేపర్స్ ఫైళ్లు మీద వాన చినుకులు పడితే నానితే అది అందరికీ నష్టమే కద,ప్రజలకు కావలసిన ఎన్నో జీవితాలు ఆ పేపర్ కంప్యూటర్ రూపంలో ఉన్నాయి, పుట్టిన పిల్లల దగ్గర నుండి చనిపోయిన మనిషి వరకు సర్టిఫికెట్స్ ఇంకా మండల సమాచారం ఇంకా ఎన్నో కంప్యూటర్స్, ఫైల్స్ అందులో ఉన్నాయి, వానకు నానితే తడిసి ముద్దయితే దానికి ఎవరు సమాధానం ఎవరు చెబుతారు. ఇకనైనా పై అధికారులు గ్రామపంచాయతీ ఆఫీస్ బిల్డింగును రిపేరు చేయించాలని అధికారులు ప్రజలు కోరుతున్నారు.

భారీగా విధిస్తున్న విద్యుత్ కోతలు

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ పట్టణంలో కొన్ని రోజులుగా విద్యుత్ అంతరాయాలు పగలు రాత్రి తేడా లేకుండా తీస్తున్నారు. చినుకుపడిన గాలివీచిన చాలు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఇది ఏమని ప్రజలు అడగగా సమాధానం చెప్పడం లేదు అధికారులు. ముందే వేసవికాలం ఉదయం తీవ్రమైన ఎండలతో భగభగమంటుంటే కాస్త చల్లగాలి కోసం ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్ స్విచ్ వేస్తే ఇంకేముంది కరెంటు లేదు, ఇంకా చిన్న పిల్లల రోదన చెప్పాల్సిన అవసరం లేదు, ఆ చిన్న పిల్లలకు ఇంట్లో ఫ్యాన్ గాలి లేకపోతే ఎలా ఉంటుందో అందరికీ తెలిసిన విషయమే . ఇంకా రాత్రిపూట కారుమబ్బులో తిరుగుతున్న చిన్నపిల్లలు ప్రజలు బయటికి వెళ్లాలంటే భయం వీధి కుక్కలతో పశువులతో భయపడుతున్న చిన్నారులు ప్రజలు . ఈ వేసవి కాలంలో కరెంటు అంతరాయం చిన్నపిల్లలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది, ఇకనైనా విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి శోచనీయం

విశాలాంధ్ర-ఉరవకొండ: తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి శోచనీయమని వజ్రకరూరు మండలం చాబాల గ్రామ సర్పంచ్ మరియు వైసీపీ నాయకులు అయిన మల్లెల జగదీష్ అన్నారు. సోమవారం ఉరవకొండ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత విద్యార్థి పై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నాని తెలిపారు. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ అన్నారు. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్షసాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదు దారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని మండి పడ్డారు. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి ఉందన్నారు. ఈ దాడికి కారకులైన అగ్రకుల విద్యార్థులు రౌడీషీటర్లను చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

రూసా భవనం తనిఖీ...

విశాలాంధ్ర-పెనుకొండ: పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధనపు తరగతుల భవనాలు మరియు మరమ్మత్తులు కోసం 2019 లో కేంద్ర ప్రభుత్వం 1.4కోట్ల రూపాయలు నిధులను విడుదల చేసింది. దీనికి గాను అపుడు కేవలం ఒకే టెండర్ రావడంతో కాంట్రాక్టర్ విజయలక్ష్మి పనులు ప్రారంభించారు. తరువాత సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిపివేయడం జరిగింది. దీని పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్ రూసా ప్రాజెక్ట్ డైరెక్టర్ నలుగురు సభ్యులతో కమిటీ ను నియమించడం జరిగింది. వీరు ఆగిపోయిన భవనాలను, మరమ్మత్తులను పరిశీలించి ఇంజనీర్లకు రీ ప్రపోజల్ తయారు చేయమని, కాంట్రాక్టర్ కు తిరిగి కొనసాగిస్తానని ధృవీకరణ చేయాలని తెలిపారు. అలాగే వారు ఆగిపోయిన పనులను పునరుద్ధరణ చేయాలని సూచించారు. కమిటీ సభ్యులు గా ఉన్నత విద్యా కళాశాల ఆర్జేడీ డా. నాగలింగా రెడ్డి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీమోహన్, రాష్ట్ర కళాశాల ఉన్నత విద్య ఆఫీసు నుండి తిరుపతిరావు, శంకర్ రావు మరియు స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ డా. కేశవరావు ఆధ్వర్యంలోని ప్రాజెక్ట్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు డా.జయప్ప, హరీష్ బాబు, యశోద రాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుంతకల్లులో తిరంగ ర్యాలీ

విశాలాంధ్ర - గుంతకల్లు : అమాయకపు భారత దేశ ఆడపడుచుల నుదుటి బొట్టును తుడిపిన ఉగ్రవాదులను నేలకు అర్పించిన దేశ సైనికులు సెలక్ట్ చేద్దామని గుంతకల్ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూరతో మన దేశ పోరాట పటిమను చాటి చెప్పిన సైనికులకు వందనం తెలియజేస్తూ పార్టీలకు అతీతంగా సైనికులకు సంఘీభావంగా గుంతకల్ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ అజంతా సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు తిరంగా యాత్ర నిర్వహించారు. అమాయకపు భారతదేశ ఆడపడుచుల నుదటి బొట్టును తుడిపిన ఆ పాకిస్తాన్ ఉగ్రవాదులను యుద్ధంలో నేలకర్పించిన దేశ సైనికులకు సెల్యూట్ చేస్తున్నాను. మన దేశ ప్రధాని ఆపరేషన్ సింధూర్ పేరుతో మన దేశ మహిళ సైనికుల అధ్యక్షతన దేటైనా సమాధానం ఇచ్చారు. ఉగ్రవాద చేతిలో బలి అయిన మన దేశ పౌరులకు, సైనిక వీరులకు శిరస్సు నుంచి ప్రణామం చేస్తూ నివాళులు అర్పిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్ , జనసేన సమన్వయకర్త వాసగిరి మణికంఠ, తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, లాయర్ కృష్ణారెడ్డి, అంజి, హనుమంతు, చిప్పగిరి ప్రతాప్, మైనారిటీ నాయకులు మహమ్మద్ గుజిరి ఖాజా, మాత్రు నాయక్, పాల మల్లికార్జున మరియు టిడిపి బిజెపి జనసేన కార్యకర్తలు నాయకులు కౌన్సిలర్లు ఇన్చార్జిలు పాల్గొన్నారు.